క్లుప్తంగా

నేడు మూడు మండలాల్లో పవర్ కట్

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో వున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నట్టు డీఈ ఆర్.శేఖర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూళ్లూరుపేట పట్టణం, సూళ్లూరుపేట రూరల్ మండలం, తడ, దొరవారిసత్రం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

26 నుంచి ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వినీల్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ జయంపు, కోటంబేడు, పెరిమిడి, ఊట్లపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఓజిలి: మండలంలో కర్రబల్లవోలు, ఓజిలి, చిలమానుచేనులోని ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీవో సుశీలాదేవి తెలిపారు. ఆమె శనివారం ఓజిలి సచివాలయాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో ఇంటి పేర్లు, ఫొటో మార్పు, డేట్ ఆఫ్ బర్త్ తదితరాలను సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శి సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

దక్కిలి : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన శనివారం పాతనాలపాడు (కమ్మవాపల్లి) ఎస్టీ కాలనీ, దళితవాడ ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. పాతనాలపాడు దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



రామచంద్రయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

రాపూరు: రాపూరు- 2 ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు రేవూరు రామచంద్రయ్య(53) ఈనెల 18న మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి శనివారం రామచంద్రం నివాసానికి చేరుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, తిరపతి పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, రమణయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



కే చెంచుకుమార్

ఓజిలి: ఓజిలి ఉన్నత పాఠశాలకు చెందిన కే.చెంచుకుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శరత్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 24న విజయనగరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సాంఘికశాస్త్ర దినోత్సవంలో అవార్డును అందుకోనున్నట్టు వెల్లడించారు. కే.చెంచుకుమార్‌ను పలువురు అభినందించారు.

జోనల్ పోటీల్లో వాకాడు గురుకుల విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులను అభినంధిస్తున్న టీచర్లు

వాకాడు : కోట గురుకుల పాఠశాలలో ఈ నెల 19 నుంచి జరుగుతున్న జోనల్ క్రీడా పోటీల్లో వాకాడు గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. వారిని శనివారం ప్రిన్సిపాల్ రామాంజనేయ ఆచార్యులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జూనియర్ విభాగంలో కబడ్డీలో మొదటి స్థానం, సీనియర్ చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. పీఈటీ శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయండి

వాకాడు : వాకాడు ఎన్‌జేఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామా విజయ్ కోరారు. ఆయన శనివారం ఎంపీడీవో అన్నపూర్ణారావుకు వినతి పత్రం అందజేశారు. కాలనీలో 86 కుటుంబాలు, 450 మందికి పైగా జనాభా ఉన్నట్టు తెలిపారు. స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

గర్భవతులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించి మాతాశిశు మరణాలను నివారించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నారు. ఇమ్యునైజేషన్, చిన్నారుల పోషణ, పిల్లల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యం, విటమిన్ లోపం నివారించడం తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు.





దైవాలదిబ్బలో తుపాను షెల్టర్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

ఇరుకు గదులే దిక్కు

- సొంత భవనాలు లేని అంగన్‌వాడీలు
- ఇరుకు గదులు, అరకొర వసతులు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

కోట ప్రాజెక్ట్ పరిధిలో	
అంగన్‌వాడీ కేంద్రాలు	225
సొంత భవనాల్లో నడుస్తున్నవి	106
అద్దె భవనాల్లో నడుస్తున్నవి	48
అద్దెలేని కేంద్రాలు	71

కోట: కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఉన్నాయి. వాటిలో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 2,822 మంది చిన్నారులు ప్రీ ప్రైమరీ విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే 615 మంది గర్భిణులు, 798 మంది బాలింతలకు సేవలు అందిస్తున్నారు. వీటిలో 106 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 48 కేంద్రాలను అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. 71 అంగన్‌వాడీలను అద్దెలేని గదుల్లో ఉన్నాయి.





లక్ష్మక్కకంద్రిగలో పూర్తికాని భవనం, నేలమీద మట్టిలోనే కూర్చున్న పిల్లలు

వసతులు లేక ఇబ్బందులు..

కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువగా అద్దె భవనాలు, దెబ్బతిన్న పాఠశాల భవనాలు, తుపాను షెల్టర్లు, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు. అవి గదులు ఇరుకుగా ఉండడంతో గాలి, వెలుతురు సక్రమంగా ఉండడం లేదు. దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేవు. మరికొన్నింటిని నిర్మాణం పూర్తికాని గదుల్లో అరకొర వసతులతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను కూటమి ప్రభుత్వం గుర్తించడం లేదని పలువురు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం వంద శాతం విజయవంతం కావాలంటే సొంత భవనాలు నిర్మించి పూర్తి వసతులు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



“ చిన్నారులు విద్య నేర్చుకునే అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులతో కూడిన గదుల్లోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలి.

– సుధమ్మ, తిన్నెలపూడి

పనులు పూర్తి చేయాలి



కొన్ని చోట్ల అంగన్‌వాడీ భవనాలు వివిధ దశల్లో పనులు నిలిచిపోయి ఉన్నాయి. వాటిని వెంటనే పూర్తి చేయాలి. లక్ష్మక్కకంద్రిగలో అంగన్‌వాడీ భవనం శ్లాబ్ దశలోనే ఉండగా అందులోనే నిర్వహిస్తున్నారు. పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి.

– రమణయ్య, లక్ష్మక్కకంద్రిగ

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రాజెక్ట్ పరిధిలో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలు, ఇతర భవనాల్లో నిర్వహిస్తున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. మరి కొన్ని భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నాం.

– మునికుమారి, సీడీపీవో, కోట

భూసమస్యను పరిష్కరించాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జమీలా కుటుంబ సభ్యులు

కోట : రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా భూ సమస్యను పరిష్కరించడం లేదని చిట్టేడుకు చెందిన జమీలా తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారికి సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ చిట్టేడులో సర్వే నంబర్ 297లో తన అనుభవంలో 71 సెంట్ల పట్టా భూమి, 41 సెంట్ల అనాధీన భూమి ఉన్నట్లు తెలిపారు. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన ఫయాజ్ ఆక్రమించుకున్నాడని వాపోయారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్, హుస్సేన్‌బాషా, షబ్బీర్‌తో కలిసి తహసీల్దార్ జయజయరావుకు వినతి పత్రం అందజేశారు.

డిసెంబర్ 7 నుంచి క్రికెట్ పోటీలు

గూడూరు రూరల్ : గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్ 7 నుంచి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజామురుగదాస్ తెలిపారు. ఆయన శనివారం క్రికెట్ పోటీల జెర్సీ, కప్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో 2004లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులతో కలిసి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గాంధీ, ధనుంజయ, మోహన్, రాజయ్య, పీడీ రవిచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామం స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఎస్.రాజేష్ తదితర నాయకులతో కలిసి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పలువురు సర్పంచులు మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని మండి పడ్డారు. రైతులకు సరిపడా కాంప్లెక్స్ ఎరువు, యూరియాను సకాలంలో ఎందుకు సరఫరా చేయలేదని సర్పంచులు మురళీకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు నిలదీశారు. డీవీ సత్రం, తొగరాముడి పీహెచ్‌సీల్లో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని, వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడంలేదని ఆరోపించారు. తొగరాముడి పీహెచ్‌సీలో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కరపాక, మైలాంగం, వెదురుపట్టు తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వేణుంబాకం ప్రాథమికోన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు షూ, టై తదితరాలు ఇప్పటి వరకు అందలేదని ఎంపీటీసీ మస్తాన్ పేర్కొన్నారు. ఎంపీడీవో గోవర్ధన మాట్లాడుతూ సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ శైలకుమారి, సీడీపీవో శారదాంబ, అధికారులు జ్యోతిర్మయి, మునిరాజ, భాస్కరయ్య, ఉమామహేశ్వరి, శ్రీదేవి, హరికృష్ణ, మెహతాజ్, మోహన్‌రావు, తేజోకిరణ్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

వెంకటగిరి రూరల్ : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.సునీత డిమాండ్ చేశారు. ఈనెల 26న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం వెంకటగిరిలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని తెలిపారు. రైతులకు పంటసాయం అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలకృష్ణయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీవీ రమణయ్య, ఆర్.సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు ఓబయ్య, ఏఐటీయూ నాయకులు జాన్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు అభివృద్ధికి సహకరించాలని వినతి



నెల్లూరులో జెడ్పీ చైర్ పర్సన్‌ను కలిసిన ఎంపీపీ ధనలక్ష్మి, జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సమీపంలోని మేనకూరు పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి కోరారు. వారు శనివారం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ సానుకూలంగా స్పందించారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలకు అతీతంగా తమ ప్రాంత అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం

నాయుడుపేట టౌన్ : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ సిబ్బంది పనిచేస్తున్నట్టు డీఈ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. నాయుడుపేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో శనివారం విద్యుత్ తీగల మరమ్మతు పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 50కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించినట్టు వెల్లడించారు. ఈఈ శ్రీనివాసులు తుమ్మూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సబ్‌డివిజన్ పరిధిలోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, అసిస్టెంట్ లైన్‌మన్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని సూచించారు. డీఈ వరప్రసాద్ రెడ్డి, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి యాదవ్

సూళ్లూరుపేట : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి యాదవ్ కోరారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్వీప్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య, గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు : 2025 జనవరికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలు, పాఠశాల ఆవరణలో బూత్ లెవల్ అధికారులు ఉంటారని, వీరి వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మార్పులు, చేర్పులకు ఫారం -7, 8 అందజేయాలని పేర్కొన్నారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి ఏర్పాటే లక్ష్యం



మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

గూడూరు రూరల్ : ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గూడూరు రూరల్ మండలం కొండాగుంట పంచాయతీలో విద్యార్థులతో కలిసి మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన వల్ల పలు రకాల వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఇంటిలోనూ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్, ఎంఆర్‌సీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాము పాల్గొన్నారు.

పంట కాలువపై పనులు నిలిపివేత

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లిలో వ్యవసాయ పంట కాలువపై చేపట్టిన హైటెన్షన్ టవర్ నిర్మాణ పనులను కోర్టు ఆదేశాలతో నిలిపేశారు. 71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న హై ఓల్టేజ్ విద్యుత్ తీగలు ఎత్తు పెంచే హైటెన్షన్ టవర్‌ను వ్యవసాయ పంట కాలువపై నిర్మిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైటెన్షన్ టవర్ నిర్మాణ పనులు నిలిపేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు శనివారం యంత్రాలతో గుంతలను పూడ్చివేశారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేపట్టారు.

వృద్ధులకు రెండు బస్తాల బియ్యం వితరణ

సూళ్లూరుపేట : ఏ పనీ చేయలేని వృద్ధ దంపతులకు తడకండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం రెండు బస్తాల బియ్యం వితరణ చేశారు. పూల కృష్ణయ్య, కమలమ్మ దంపతులు ఎక్కడి నుంచో వచ్చి సూళ్లూరుపేటలో పూలవ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వయసు మీద పడింది. కృష్ణయ్య మంచంలో పడిపోవడం, కమలమ్మ పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. తినడానికి తిండిలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు రెండు బస్తాల బియ్యం అందజేశారు. సంస్థ ప్రతినిధులు నెల్లూరు నాగరాజు, కొలమల నందయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపును మరోచోటుకు మార్చండి

సైదాపురం : మండలంలోని కలిచేడు గ్రామంలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం షాపులను మరొక చోటుకు మార్చాలని ఏబీఎస్‌ఏ రాష్ట్ర నాయకుడు షేక్ సర్దార్ షఫీ హరాన్ తెలిపారు. ఆయన శనివారం మహిళలతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కలిచేడులో ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనిపై నిరసన తెలుపుతున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మద్యం దుకాణాలను మరోచోటుకు తరలించాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

గూడూరు రూరల్ : గూడూరు మున్సిపాలిటీలోని చెన్నూరు గ్రామంలో శనివారం నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కథనం మేరకు.. చెన్నూరు కాపువీధికి చెందిన సులోచనమ్మ బజారు నుంచి ఇంటికి నడిచి వెళుతోంది. గుర్తు తెలియని యువకుడు బైక్‌లో వస్తూ ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతన్ని వెంబడించినప్పటికీ ఫలితం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వాకాడు : మండలంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గతంలో పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ అనసూయమ్మ ప్రధాన ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బాలిరెడ్డిపాళెం ఆస్పత్రిలో సమస్యలు ఉన్నాయని, బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెం మధ్య వంతెన నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ వెంకటరయణయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

వెంకటగిరి(సైదాపురం) : అక్రమ మద్యం, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని గూడూరు ఏఈఎస్ ఊహశ్రీ తెలిపారు. ఆమె శనివారం వెంకటగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ పరిధిలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని గ్రామాల్లో తనిఖీలు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వెంకటగిరిలోని మద్యం దుకాణాలను తనిఖీచేశారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విశ్వోదయ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి

వెంకటగిరి రూరల్ : ఎరువుల దుకాణంలో ఎరువుల కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని వెంకటగిరి, నాయుడుపేట ఏడీఏ సూచేంద్ర, స్థానిక ఏడీఏ నాగార్జునసాగర్ ఆదేశించారు. వారు శనివారం వెంకటగిరిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, నకిలీలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో సుజాత పాల్గొన్నారు.

